కూడా మరణించింది. వెంటనే అతను దాన్ని కొన్న దుకాణానికి వెళ్ళి జరిగింది చెప్పి, అవెలా మరణించాయని నిగ్గదీసాడు.

ఆ దుకాణం యజమాని అతన్ని అనేక ప్రశ్నలు వేసి జరిగింది గ్రహించి చెప్పాడు.

"తొట్టిని సబ్బు నీళ్ళతో కడగకూడదు. అందువల్లే అవి చచ్చి పోయాయి."

ఇదేవిధంగా మనం మన కుటుంబ సభ్యులని, ముఖ్యంగా పిల్లల జీవన విధానాలని శుభ్రం చేయడానికి తిట్లు, విమర్శలు, అవమానకరంగా మాట్లాడటం అనే సబ్బు నీటిని వాడతాం. మనం చేసేది సరైనదే అనుకుంటాం కాని అవి వారి పాలిట శత్రువుగా పనిచేస్తాయి.

## 139. విశ్వాసం

ఓ పర్వతారోహకుడు ఓ సారి ఎవరెస్ట్ శిఖరం ఎక్కుతున్నాడు. సగం దూరం ఎక్కాక ఓ రోజు చీకటి పడసాగింది. ఇంకో ఏభై మీటర్లు ఎక్కితే సమతల ప్రదేశం వస్తుంది కాబట్టి చీకటి పడినా, పైకి వెళ్ళి అక్కడ టెంట్ వేసుకుని విశ్రాంతి తీసుకోవాలనుకుని ఎక్కసాగాడు. అకస్మాత్తుగా అతని చేతులు పట్టు తప్పి కిందకి పడసాగాడు. అదృష్టవశాత్తు అతని నడుం చుట్టూ, కొండలో దిగ కొట్టిన ఓ పరికరానికి కట్టిన తాడు రెండో కొస ఉండటంతో, కొంత దూరం వెళ్ళాక ఆగి గాల్లో వేలాడసాగాడు. అతను దైవ భక్తుడు కాబట్టి వెంటనే దేవుడ్ని తనని కాపాడటానికి సహాయం పంపమని ప్రార్థించసాగాడు.

కొంతసేపటికి అకస్మాత్తుగా గంభీరమైన కంఠం వినిపించింది.

"తాడుని కోసెయ్."

"నువ్వెవరు?" ప్రశ్నించాడు ఆ పర్వతారోహకుడు.

"నేను దేవుడ్ని."

"తాడుని కోసేస్తే కిందపడి మరణించనూ? నువ్వు దేవుడివి కావు."

"నమ్మకపోతే అది నీ ఇష్టం."

మర్నాడు అతన్ని వెదుకుతూ వచ్చినవారు, తాడుకి వేలాడే మంచుకి గడ్డకట్టుకుని మరణించిన అతని శవాన్ని చూసారు. అంతే కాదు. అతని కాళ్ళకింద కేవలం అడుగున్నర దూరంలో చదునుగా ఉన్న పెద్ద రాయి ఉంది! దేవుడ్ని పరిపూర్ణ విశ్వాసంతో నమ్మాలి.

## 140. గీతా భాష్యం

తన కొడుక్కి బదిలీ అవడంతో ఓ చిన్న ఊరుకి ఓ ముసలావిడ వచ్చింది. వాళ్ళు అద్దెకుండే ఇంటికి దగ్గర్లో ఉన్న చిన్న సూపర్ బజార్‌కి ఆవిడ తరచూ వెళ్ళి ఇంటికి కావల్సిన సరుకులు తీసుకువస్తూండేది. అక్కడి సేల్స్‌మెన్ ఆవిడని 'మామ్మగారు' అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. చదవడం రాని ఆవిడ భగవద్గీతని టేప్ రికార్డర్‌లో వినేది.

ఓ రోజు తన కొడుకు పుట్టిన రోజున ఆవిడ సూపర్ బజార్‌కి వెళ్ళి సామాను కొనుక్కొచ్చి పాయసం, గారెలు చేసింది. తన కొడుక్కి పెట్టాక ఆవిడ మిగిలింది తీసుకుని బయటకి వెళ్ళడం చూసిన కొడుకు అడిగాడు.

"అదేమిటి? నువ్వు తినకుండా వాటిని ఎవరికి తీసుకెళ్తున్నావు?"

"సూపర్ బజార్‌లో పనిచేసే సేల్స్‌మెన్‌కి."

"వాళ్ళకెందుకు? వాళ్ళు మనకేం కారుగా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కొడుకు.

అందుకా తల్లి చెప్పిన సమాధానం ఇది.

" భగవద్గీత చదవడానికి నాకు చదువు రాదు. కాని గీతలోని ప్రతీ పేజీలో 'ప్రేమ' అన్న పదం రాసి ఉంటుందని నాకు తెలుసు. ప్రేమంటే మనకి ఉన్నది ఇతరులతో పంచుకోవడమే అని నా అభిప్రాయం."

ఈ సారి కొడుకు ఆవిడకి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.